
ఖమ్మం నగరంలో ప్రచారం చేస్తున్న ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు

## మరోసారి భారీ మెజార్టీ అందించండి

**ఖమ్మం ఎన్నికల ప్రచారంలో ఎంపీ నామా నాగేశ్వరరావు**


నమాజులో పాల్గొన్న ఎంపీ నామా నాగేశ్వరరావు

ఖమ్మం, ఏప్రిల్ 5 : వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తనను మరోసారి ఆశీర్వదించి భారీ మెజార్టీతో పార్లమెంట్‌కు పంపాలని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు ఓటర్లను కోరారు. శుక్రవారం ఖమ్మం కస్బాబజార్‌లో స్థానిక ముస్లిం నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జామా మసీదు ప్రాంతంలో ఉన్న వివిధ దుకాణాల్లోకి వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. గత ఎన్నికల్లో మంచి మెజార్టీతో గెలిపించి పార్లమెంట్‌కు పంపిస్తే జిల్లావాణిని లోక్‌సభలో వినిపించానని, జిల్లా అభివృద్ధికి ఎంతో కృషిచేసిన తనను మళ్లీ గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ నాయకులు తాజుద్దీన్, ఖమర్, ఫిరోజ్, మగ్బుల్ పాల్గొన్నారు.

**ఖమ్మం జామా మసీదులో..**

ఖమ్మం కస్బాబజార్‌లోని జామా మసీదులో ముస్లింలతో కలిసి నామా నాగేశ్వరరావు ప్రార్థనలు చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో తనకు ఓటువేసి, అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. విడివిడిగా ముస్లిం సోదరులను కలిసి ఓట్లు అడిగారు. ముస్లింలందరికీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

# కేసీఆరే తెలంగాణకు శ్రీరామరక్ష

- రాష్ట్ర అభివృద్ధి కోసం ఆయన పదేళ్లపాటు ఎనలేని కృషిచేశారు
- ఎంపీ ఎన్నికల్లో విజయం కోసం మరింత ఉత్సాహంతో పనిచేద్దాం
- సత్తుపల్లి సన్నాహక సమావేశంలో ఖమ్మం ఎంపీ నాగేశ్వరరావు
- కాంగ్రెస్‌వన్నీ అమలు సాధ్యంకాని హామీలే..: వద్దిరాజు, మధు


నియోజకవర్గ సన్నాహక సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు


సత్తుపల్లి సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ నామా నాగేశ్వరరావు, చిత్రంలో ఎంపీ వద్దిరాజు, ఎమ్మెల్యే మధు, మాజీ ఎమ్మెల్యే సండ్ర

సత్తుపల్లి టౌన్, ఏప్రిల్ 5: 14 ఏళ్లపాటు కొట్లాడి స్వరాష్ర్టాన్ని సాధించిన కేసీఆరే తెలంగాణకు శ్రీరామరక్ష అని ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం పదేళ్లపాటు ఆయన ఎనలేని కృషిచేశారని గుర్తుచేశారు. సత్తుపల్లిలోని ఓ ఫంక్షన్ హాల్లో శుక్రవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల సత్తుపల్లి నియోజకవర్గ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ కృషి వల్లనే తెలంగాణ అద్భుతంగా అభివృద్ధి సాధించిందని గుర్తుచేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో 1.5 శాతం ఓట్లతో మాత్రమే బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోయిందని తెలిపారు. అయినా ఈ ఓటమికి కుంగిపోకుండా మరింత ఉత్తేజంతో బూత్ స్థాయిల నుంచి పనిచేద్దామని పిలుపునిచ్చారు.

**కాంగ్రెస్‌వన్నీ అమలు సాధ్యంకాని హామీలే..: వద్దిరాజు, తాతా మధు**

అమలు సాధ్యంగాని హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు అన్నారు. కాంగ్రెస్ 100 రోజుల పాలనలోనే తాము మోసపోయామని ప్రజలు గ్రహించారని అన్నారు. ఈ పార్లమెంటు ఎన్నికల్లో వారు బీఆర్ఎస్‌ను ఆదరిస్తారని అన్నారు. అయినా, రాజకీయాల్లో గెలుపోటములు సహజమని అన్నారు. అయితే గెలుపోటములతో సంబంధం లేకుండా రాజకీయాలు చేయడమే రాజకీయ నాయకుడి లక్షణమని అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికలకు, ఇప్పటి పార్లమెంట్ ఎన్నికలకు చాలా తేడా వచ్చిందని అన్నారు. ఈ ఎన్నికల్లో ఖమ్మం ఎంపీగా నామా నాగేశ్వరరావును మరోసారి గెలిపించి తెలంగాణ ఆత్మగౌరవాన్ని నిలుపుదామని పిలుపునిచ్చారు.

**పంటలు కొనమంటే కుంటి సాకులు చెప్తున్నారు: సండ్ర**

తాము పండించిన పంటలను కొనాలని రైతులు కోరుతుంటే.. కాంగ్రెస్ నాయకులు మాత్రం కుంటిసాకులు చెబుతున్నారని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తున్నామని అన్నారు. అయితే కాంగ్రెస్ చెప్పినట్లుగా కల్యాణలక్ష్మి పథకంలో తులం బంగారం పంపిణీ ఏమైందని ప్రశ్నించారు. అనంతరం రాజ్యసభ సభ్యుడిగా మరోసారి ప్రమాణ స్వీకారం చేసిన వద్దిరాజు రవిచంద్రను సత్తుపల్లి బీసీ సంఘం నేతలు సత్కరించారు. బీఆర్ఎస్ నాయకులు కొత్తూరు ఉమామహేశ్వరరావు, వనమా వాసు, కూసంపూడి మహేశ్, యాగంటి శ్రీను, రఫీ, దొడ్డా హైమావతి తదితరులు పాల్గొన్నారు.

## ఉప ముఖ్యమంత్రి వాహనం తనిఖీ


డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కారును ఎన్నికల అధికారులు శుక్రవారం మధిర చెక్‌పోస్ట్ వద్ద తనిఖీ చేశారు. ఎన్నికల నియమావళికి అనుగుణంగా అన్ని వాహనాల మాదిరిగానే భట్టి కారును కూడా తనిఖీ చేశారు. **-మధిర, ఏప్రిల్ 5**

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

పెనుబల్లి, ఏప్రిల్ 5: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన ఘటన మండల పరిధిలోని లంకపల్లి గ్రామం మూలమలుపు వద్ద జరిగింది. స్థానికులు తెలిపిన ప్రకారం.. కొత్తలంకపల్లి గ్రామానికి చెందిన చింతల వెంకటేశ్వరరావు, పాశం దుర్గాప్రసాద్ బైక్‌పై వస్తుండగా లంకపల్లి గ్రామ సమీపంలోని మూలమలుపు వద్ద బైక్ అదుపు తప్పి రోడ్డు సైడ్ ఉన్న సూచికబోర్డును ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన 30 నిమిషాల వరకు పోలీసులు కానీ, అంబులెన్స్ కానీ రాకపోవడంతో క్షతగాత్రులను స్థానికులు ఆటోలో పెనుబల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా పోలీసులు చేరుకొని క్షతగాత్రులను హాస్పిటల్‌కు తరలించారు. ప్రస్తుతం వీరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

## పువ్వాడనగర్ మాజీ సర్పంచ్ భర్త అరెస్ట్

రఘునాథపాలెం, ఏప్రిల్ 5 : ప్రభుత్వం పేదలకు కేటాయించిన ప్లాట్లను బలవంతంగా తక్కువ ధరకు కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయించడంపై రఘునాథపాలెం పోలీసులు పువ్వాడ ఉదయ్‌నగర్ కాలనీ మాజీ సర్పంచ్ కాంపాటి లలిత భర్త కాంపాటి రవిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ శ్రీధర్ తెలిపారు. రఘునాథపాలెం తహసీల్దార్ లూథర్ ఫిర్యాదు మేరకు శుక్రవారం కాంపాటి రవిని అరెస్ట్ చేసి మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచి అనంతరం రిమాండ్ చేసినట్లు తెలిపారు.

## వ్యవసాయ భూముల్లో మట్టి నమూనాల సేకరణ

ముదిగొండ, ఏప్రిల్ 5: మండలంలోని మాధాపురంలోని వ్యవసాయ భూముల్లో మట్టి నమూనాలను మధిర ఏడీఏ వెంకటేశ్వరరావు శుక్రవారం సేకరించారు. రైతులతో ఆయన మాట్లాడుతూ.. భూసార పరీక్షల కోసం ఈ మట్టిని సేకరించామన్నారు. ఏవో రాధ, ఏఈవో దివ్య మనీషా తదితరులు పాల్గొన్నారు.

## రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

చింతకాని, ఏప్రిల్ 5: చిన్నమండవ మున్నేరు నుంచి ఇసుకను అక్రమంగా ఖమ్మం తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఎస్సై నాగుల్‌మీరా శుక్రవారం జగన్నాథపురం అడ్డరోడ్డు వద్ద పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. యజమానులపై కేసులు నమోదు చేశారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds
WANTED
★Wanted Agents, Associates Franchise throughout Telangana for Abroad Medical College Admission. 8881116865 / 8881115253.
NT-311882-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## నేడు విద్యుత్‌కు అంతరాయం

వేంసూరు/ పెనుబల్లి, ఏప్రిల్ 5: విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా వేంసూరు మండలం గూడూరు, రాయుడుపాలెం, పెనుబల్లి మండలం మర్లపాడు సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈలు ఏఈ అనిల్, భుజంగరావు శుక్రవారం వేర్వేరుగా తెలిపారు.

## 'ప్రధాని మోదీని ఓడించాలి'

సత్తుపల్లి, ఏప్రిల్ 5: ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ప్రధాని మోదీని ఓడించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదినారాయణ అన్నారు. మండలంలోని రేజర్లలో శుక్రవారం జరిగిన ఉపాధి కూలీల సమావేశంలో ఆయన మాట్లాడారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

## తాగునీటి సమస్యలు రాకుండా..

# ముందస్తు జాగ్రత్తలు పాటించాలి

- 10న సీఎస్‌తో జరిగే మీటింగ్‌లో జిల్లాకు నీటి విడుదలపై చర్చ
- జిల్లా తాగునీటి సరఫరా పర్యవేక్షణ అధికారి సురేంద్రమోహన్


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి సురేంద్రమోహన్, చిత్రంలో కలెక్టర్ వీపీ గౌతమ్

మామిళ్లగూడెం, ఏప్రిల్ 5: తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఉభయ ఖమ్మం జిల్లాల తాగునీటి సరఫరా పర్యవేక్షణ ప్రత్యేక అధికారి, ప్రభుత్వ కార్యదర్శి కే సురేంద్రమోహన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ వీపీ గౌతమ్‌తో కలిసి మిషన్ భగీరథ, మున్సిపల్, ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయతీ అధికారులతో జిల్లాలో తాగునీటి సరఫరాపై సమీక్షించారు. ఈ సందర్భంగా సురేంద్రమోహన్ మాట్లాడుతూ ప్రభుత్వం తాగునీటి సరఫరా పర్యవేక్షణ కోసం కార్యదర్శి స్థాయి అధికారిని జిల్లాలకు పంపిందని, దీన్ని బట్టి తాగునీటికి ప్రభుత్వం ఎంత ప్రాధాన్యత నిస్తుందో తెలుస్తుందన్నారు. తాగునీటి సరఫరాపై వస్తున్న వ్యతిరేక కథనాలపై వెంటనే స్పందించి పరిష్కార చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ నెల 10న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో తాగునీటి సరఫరాపై సమావేశం ఉందని, సమావేశంలో జిల్లాకు కావాల్సిన నీటి విడుదలపై చర్యలు తీసుకోనున్నట్లు అన్నారు. పాలేరు రిజర్వాయర్ ద్వారా జూన్ వరకు తాగునీటి సరఫరా కోసం 1.74 టీఎంసీల నీరు అవసరం ఉంటుందని, ప్రస్తుతం నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నుంచి వదులుతున్న నీటికి అదనంగా మే నెలలో మరో టీఎంసీ నీరు అందిస్తే తాగునీటి సమస్యలు ఉండవని అన్నారు. వైరా రిజర్వాయర్‌కు జూన్ వరకు తాగునీటి అవసరాలకు 0.87 టీఎంసీ నీటి అవసరం ఉందని, నాగార్జున సాగర్ నుంచి మే చివరి వారంలో 0.31 టీఎంసీ నీటి సరఫరా చేస్తే సమస్యలు ఉండవని అన్నారు. కలెక్టర్ వీపీ గౌతమ్ జిల్లాలో తాగునీటి సరఫరాపై వివరించారు. ప్రతి మండలంలో మండల ప్రత్యేక అధికారి, ఎంపీడీవో, ఎంపీవో, ఏఈఈలు రోజువారీ తాగునీటి సరఫరా పర్యవేక్షణ చేస్తున్నట్లు చెప్పారు. అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, శిక్షణ సహాయ కలెక్టర్లు మయాంక్‌సింగ్, యువరాజ్, అధికారులు శ్రీనివాస్, విద్యాసాగర్, సదాశివకుమార్, సురేందర్, వినోద్, హరికిషన్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళల భద్రతకు ప్రాధాన్యం: సీపీ సునీల్‌దత్



మామిళ్లగూడెం, ఏప్రిల్ 5 : ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలో మహిళల భద్రత కోసం ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళల రక్షణ కోసం షీ టీమ్స్ బృందాలు అన్నివేళలా అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. బాధితుల వివరాలు అత్యంత గోప్యంగా ఉంచుతారన్నారు. నేరుగా షీ టీం బృందాలను కలిసి ఫిర్యాదు చేయాల్సిన పనిలేదని, డయల్100, వాట్సాప్, క్యూఆర్ కోడ్ తదితర అనేక విధానాల్లోనూ ఫిర్యాదు చేయవచ్చన్నారు.


తొలి మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ప్రత్యేకాధికారి సురేంద్ర మోహన్, కలెక్టర్ వీపీ గౌతమ్, సీపీ సునీల్‌దత్

# జగ్జీవన్‌రామ్ సేవలు మరువలేనివి

**తొలి మాజీ ఉప ప్రధాని జయంతి వేడుకల్లో వక్తలు**


వైరాలో జగ్జీవన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నామా, చిత్రంలో రాములు, మదన్‌లాల్

శానికి తొలి ఉప ప్రధానిగా బాబూ జగ్జీవన్‌రామ్ చేసిన సేవలు మరువలేనివని, మహనీయుల త్యాగాలను ప్రతిఒక్కరూ తెలుసుకోవాలని కలెక్టర్ వీపీ గౌతమ్ అన్నారు. జగ్జీవన్‌రామ్ 117వ జయంతి వేడుకలను కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రాజ్యాంగం రూపకల్పనలో కీలక పాత్ర పోషించిన మహనీయుడు జగ్జీవన్‌రామ్ అని అన్నారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమం, రాజకీయ రంగం, సామాజికవేత్తగా జగ్జీవన్‌రామ్ ప్రత్యేక ముద్ర వేశారని అన్నారు. అన్నివర్గాల అభ్యున్నతికి కృషిచేశారని తెలిపారు. వివిధ శాఖల జిల్లా అధికారులు తమ తమ కార్యాలయాల్లో బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు. అలాగే, వివిధ పార్టీల నేతలు, ఆయా సంఘాల నాయకులు కూడా తమ తమ కార్యాలయాల్లో బాబూ చిత్రపటాలకు, విగ్రహాలకు నివాళులర్పించారు. సత్తుపల్లిలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, మధిరలో జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు తదితరులు మాట్లాడుతూ.. జగ్జీవన్ సేవలను కొనియాడారు. **-నమస్తే తెలంగాణ నెట్‌వర్క్**


మధిరలో నివాళులర్పిస్తున్న జడ్పీ చైర్మన్..


సత్తుపల్లిలో..


కూసుమంచి (నేలకొండపల్లి)లో..


బోనకల్లులో..


వేంసూరులో..

## పాలేరుకు జలకళ



మొన్నటి రోజున పూర్తిగా ఎండిపోయి కనిపించిన పాలేరు జలాశయం.. సాగర్ జలాల చేరికతో శుక్రవారం కళకళలాడింది. గురువారం తెల్లవారుజామున పాలేరుకు సాగర్ జలాల రాక మొదలైంది. సాగర్ ఎడమ కాలువకు 6,100 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. పాలేరుకు 5,200 క్యూసెక్కుల నీరు రావడం రికార్డుగా నిలిచింది. సాగర్ నుంచి 135 కిలోమీటర్ల దూరంలో ఎక్కడా నీటి మళ్లింపు/చౌర్యం లేకుండా నేరుగా మునగాల రిజర్వాయర్ నుంచి పాలేరుకు నీరు వస్తున్నది. గురువారం సాయంత్రానికి 3,100 క్యూసెక్కులు, శుక్రవారం సాయంత్రానికి 5,200 క్యూసెక్కుల నీరు వచ్చింది. దీంతో నీటి మట్టం 13 అడుగులకు చేరుకుంది. మరో రెండు రోజుల్లో 18 అడుగుల పైన నీటి మట్టం పెరిగే అవకాశముంది. పాలేరు రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి మట్టం 23 అడుగులు. **-కూసుమంచి, ఏప్రిల్ 5**

## టెన్త్ స్పాట్‌ను పరిశీలించిన జేడీ సర్వీసెస్

ఖమ్మం ఎడ్యుకేషన్, ఏప్రిల్ 5: నగరంలోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలోని టెన్త్ స్పాట్ కేంద్రాన్ని విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ (సర్వీసెస్) పి.మదన్‌మోహన్ శుక్రవారం పరిశీలించారు. కొందరు ఉపాధ్యాయుల వద్ద సెల్ ఫోన్లు ఉండడాన్ని గమనించి, కఠిన చర్యలు తీసుకోవాలని డీఈవోను ఆదేశించారు. వారి నుంచి ఫోన్లను అధికారులు స్వాధీనపర్చుకుని, సాయంత్రం వాల్యుయేషన్ ముగిశాక తిరిగి ఇచ్చారు. ఈ నెల 9న (ఉగాది), 11న (రంజాన్) సెలవు ప్రకటించినట్లు, 13వ తేదీ వరకు స్పాట్‌ను పొడిగించినట్లు డీఈవో సోమశేఖర శర్మ తెలిపారు.

## సీవోఈలో 'బాలాజీ' పాఠశాల విద్యార్థికి సీటు

సత్తుపల్లి, ఏప్రిల్ 5: ప్రతిష్ఠాత్మక సీవోఈ పరీక్షలో కల్లూరు బాలాజీ హైస్కూల్ విద్యార్థి పెరుమాళ్లపల్లి అఖిలేశ్ శరణ్ అత్యంత ప్రతిభ కనబర్చి ఎంపీసీలో సీటు సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ వలసాల బాలాజీ శుక్రవారం తెలిపారు. అత్యంత ప్రసిద్ధిగాంచిన గౌలిదొడ్డి కళాశాలలో సీటు సాధించిన విద్యార్థిని హెచ్‌ఎం కొదమసింహం నరేంద్ర, ఉపాధ్యాయులు అభినందించారు.

## కీచక ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు

మధిర, ఏప్రిల్ 5: మధిర మున్సిపాలిటీ మడుపల్లి జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం చాట్ల సాదు సమాధానంపై సస్పెన్షన్ వేటు వేస్తూ వరంగల్ ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాలలోని విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించాడన్న ఆరోపణల నేపథ్యంలో సాదు సమాధానంపై పోక్సో కేసు నమోదైంది. ఆయనను గత నెల 31న మధిర పోలీసులు అరెస్ట్ చేశారు. దీంతో ఉద్యోగుల సర్వీస్ రూల్స్ ప్రకారం ఆయనపై సస్పెన్షన్ వేటు పడింది. ఆయన గురువారం జైలు నుంచి బెయిల్‌పై బయటకు వచ్చారు.

## మినరల్ వాటర్ ప్లాంట్లు ప్రారంభం


వాటర్ క్యాన్లు అందజేస్తున్న ఫౌండర్లు

కారేపల్లి, ఏప్రిల్ 5: మండలంలోని గేటుకారేపల్లి, కారేపల్లి, రేగులగూడెం గ్రామాల్లో మినరల్ ప్లాంట్లను రూ.22 లక్షల వ్యయంతో తోటకూరి ఫౌండేషన్ ఏర్పాటు చేసింది. వీటిని ఫౌండేషన్ వ్యవస్థాపకులు తోటకూరి పిచ్చయ్య-సత్యవతి దంపతులు శుక్రవారం ప్రారంభించారు. గ్రామ పెద్దలు తోటకూరి శ్రీనివాసరావు, మండెపూడి సత్యనారాయణ, అడ్డగోడ ఐలయ్య, హన్మకొండ రమేష్, గుజ్జర్లపూడి శ్రీను, చెరుకూరి రాజా తదితరులు పాల్గొన్నారు.

## 'గీతాంజలి'కి చిత్రలయ పురస్కార్


మెమెంటో అందజేస్తున్న బాధ్యులు

ఖమ్మం ఎడ్యుకేషన్, ఏప్రిల్ 5: నగరంలోని గీతాంజలి విద్యానికేతన్‌కు చిత్రాలయ పురస్కార్ లభించింది. సుచిరిండియా ఫౌండేషన్ శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఈ పురస్కార్‌ను ఆస్కార్ అవార్డు గ్రహీత-సినీ కవి చంద్రబోస్, డీఆర్‌డీఓ చైర్మన్ డాక్టర్ జి.సతీశ్‌రెడ్డి నుంచి పాఠశాల కరస్పాండెంట్ టీవీ అప్పారావు స్వీకరించారు.

## ఎస్‌బీఐటీ విద్యార్థులకు ఉద్యోగాలు


ఎంపికైన వారితో యాజమాన్య బాధ్యులు

ఖమ్మం ఎడ్యుకేషన్, ఏప్రిల్ 5: నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాలలో ఎక్స్‌ఎల్ఆర్ సంస్థ శుక్రవారం ప్రాంగణ నియామకాలను నిర్వహించింది. ఇక్కడి విద్యార్థులు 31 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరిని కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ, కరస్పాండెంట్ డాక్టర్ ధాత్రి అభినందించారు.

## ఖమ్మంలో ముగిసిన ఉర్సు ఉత్సవాలు


ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు

ఖమ్మం, ఏప్రిల్ 5: ఖమ్మం నగరంలోని శుక్రవారపేటలోని హజరత్ సయ్యద్ పీర్ గైబ్ షావలి బాబా ఉర్సు ఉత్సవాలు శుక్రవారం ముగిశాయి. ఆనవాయితీ ప్రకారం తుమ్మలగడ్డలోని దర్గా సేవకుడు తాజ్ బాబా ఇంటి నుంచి ఊరేగింపు మొదలై తుమ్మలగడ్డ మసీదు, మోమినాన్ స్కూల్, శుక్రవారపేట సెంటర్, రిక్కబజార్ సెంటర్, శివాలయం మీదుగా దర్గాలోకి చేరింది. మతపెద్దలు, భక్తులు, ప్రత్యేక ప్రార్థనలు చేసి పునీతులయ్యారు. ఉర్సు ఉత్సవాలను విజయవంతం చేసిన ప్రతిఒక్కరికి పేరుపేరునా తాజ్‌బాబా ధన్యవాదాలు తెలిపారు.

## కార్యాలయాల్లో చలివేంద్రాలు ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కమిషనర్

వైరా టౌన్/ చింతకాని, ఏప్రిల్ 5: మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని కమిషనర్ సీహెచ్ వేణు శుక్రవారం ప్రారంభించారు. మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**ఎంపీడీవో కార్యాలయంలో..:** చింతకాని మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఎంపీడీవో రామయ్య శుక్రవారం ప్రారంభించారు. వేణుగోపాల్, శ్రీనివాస్, మీరా, కోటయ్య పాల్గొన్నారు.